సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం, 13, మే, 2023



హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం

భీమవరంలో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఏ పెంచడంపై కలెక్టరేట్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు.

IIలో ▸



కారులో మంటలు

ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన నూజివీడు మండలం గొల్లపల్లిలో చోటుచేసుకుంది.

IIలో ▸



లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మొదటి అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్ కోరారు.

IIలో ▸

ఉద్యాన వర్సిటీ.. పరిశోధనల్లో మేటి

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- అట్టహాసంగా వర్సిటీ స్నాతకోత్సవం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రశాంతి



స్నాతకోత్సవ వేదికపై మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్




గవర్నర్‌ను సత్కరిస్తున్న వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: విద్య, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల్లో వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అగ్రగామిగా ఉండటం సంతోషంగా ఉందని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం ఉద్యాన వర్సిటీ ఐదో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా ఎదగడంతో పాటు మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా మార్చేందుకు విశేష కృషి జరుగుతోందన్నారు. గత మూడేళ్లుగా జాతీయస్థాయిలో వర్సిటీ బహుముఖ అభివృద్ధిని సాధిస్తుందన్నారు. నేషనల్ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ అక్రిడేషన్ బోర్డు ద్వారా ఏ గ్రేడ్ గుర్తింపును సాధించడం ఆనందంగా ఉందన్నారు.

18 రకాల వంగడాలకు ఊపిరి

శాస్త్రవేత్తలు బయో ఫోర్టిఫైడ్ రకాలు సృష్టిస్తున్నారని, అధిక దిగుబడులు ఇచ్చే 18 రకాల వంగడాలకు ఊపిరిపోశారని గవర్నర్ అన్నారు. ఇవి స్టేట్ వెరైటీ రిలీజ్ కమిటీ గుర్తింపును కూడా పొందాయన్నారు. నాణ్యమైన వంగడాలు, నాణ్యమైన నారును విశిష్ట రక్షిత సాగు కేంద్రం ద్వారా అందించడం ముదావహమని కొనియాడారు. ఉద్యాన వర్సిటీ ద్వారా వాణిజ్యపరమైన నర్సరీలకు నేషనల్ హార్టీకల్చర్ బోర్డు ద్వారా అక్రిడేషన్ పొందడం ఆనందంగా అన్నారు. కేవీకేల ద్వారా ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజీ కార్యక్రమం విజయవంతంగా సాగుతుందన్నారు. కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు మరిన్ని వర్సిటీ చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. వీసీ టు విలేజ్, మన విశ్వవిద్యాలయం, మన సేంద్రియ గ్రామం, మన గ్రామం-మన పోషణ తోట, ఉద్యాన మిత్ర, డిజిటలైజేషన్, రైతు భరోసా కేంద్రాల పరిపుష్టికి వర్సిటీ అందిస్తున్న సేవలపై మాట్లాడారు. టీటీడీ పుష్పప్రసాదం గురించి ఉదాహరించారు. నూతన జాతీయ విద్యావిధానానికి అనువుగా చదువు ద్వారా కలిగే వాణిజ్య ప్రయోజనాల గురించి యోచన చేయాలని వర్సిటీ అధికారులకు గవర్నర్ అబ్దుల్ నజీర్ సలహా ఇచ్చారు.

ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ మాట్లాడుతూ వర్సిటీ విద్యాపరంగా తీసుకొచ్చిన మౌలిక మార్పులు, అంతరించిపోతున్న మొక్కల సేకరణతో వనాల ఏర్పాటు, ఉద్యాన యాత్ర, మహిళల శిక్షణా కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం గవర్నర్‌ను సత్కరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు వందన సమర్పణ చేశారు. ఉదయం షెడ్యూలు ప్రకారం ఇక్కడకు చేరుకున్న గవర్నర్‌కు కలెక్టర్ పి.ప్రశాంతి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రూపు ఫొటో తంతు ముగిసిన తర్వాత స్నాతకోత్సవ వస్త్రధారణతో గవర్నర్‌తో పాటు అతిథులు, బోర్డు సభ్యులు వేదిక వద్దకు చేరుకున్నారు. వర్సిటీలో పరిశోధనలో ప్రతిభ కనబర్చిన శాస్త్రవేత్త లు, చదువులో రాణించిన విద్యార్థులకు బంగారు పతకాలు, అవార్డులను గవర్నర్ అందించారు. వర్సిటీ ప్రచురణలను ఆవిష్కరించారు. విద్యార్థుల కోలాహలం మధ్య స్నాతకోత్సవం ఉత్సాహంగా జరిగింది.



క్రిమి సంహారక మందుల వాడకం అనర్థదాయకం

నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్

క్రిమి సంహారక మందులు వాడటం వల్ల వాతావరణంలో పెనుమార్పులు కలుగుతున్నాయని, దీనిని పరిరక్షించేలా రైతులకు సేంద్రియ విధానాలపై విద్యార్థులు అవగాహన కల్పించాలని నీతి ఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్ అన్నారు. ఆయిల్‌పామ్, బొప్పాయి, నిమ్మ, కొబ్బరి, టమాటా, కోకో తదితర పంటల్లో ముందంజలో, మామిడి, స్వీట్ ఆరెంజ్, ఔషధ మొక్కలు వంటి ఉద్యాన పంటలు పండించడంలో ద్వితీయ స్థానంలో ఉన్నామన్నారు.

శ్రమకు ఫలితం దక్కింది

- వర్సిటీకి, రైతులకు రుణపడి ఉంటాం
- బంగారు పతక విజేతల వెల్లడి

శ్రమకు ఫలితం దక్కింది. ఉద్యాన వర్సిటీ, రైతులు అందించిన ప్రోత్సాహాలు మరువలేం. సంస్థకు, ప్రోత్సాహం అందించిన వారికి రుణపడి ఉంటామని గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా బంగారు పతకాలు, అవార్డు అందుకున్న శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు.

అవార్డు బాధ్యత పెంచింది



ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త పురస్కారం రావడం ఆనందంగా ఉంది. అధికారులు, క్షేత్రస్థాయిలో రైతులు అందించిన ప్రోత్సాహం మరువలేనిది. రైతుల ఆదాయం పెంచడానికి కృషి చేశాం. బంగారు పతకం, అవార్డు రావడం మా బాధ్యతను మరింత పెంచింది.

– డాక్టర్ ఎ.దేవీవరప్రసాదరెడ్డి, మత్స్య సంపద సైన్స్ శాస్త్రవేత్త, కేవీకే, వెంకట్రామన్నగూడెం

ఆనందంగా ఉంది



అరటిలో టిష్యూకల్చర్ పద్ధతిలో అమృతపాణిపై చేసిన ప్రయోగాలు ఫలవంతమయ్యాయి. సేంద్రియ సాగు విధానాలు, పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చాం. అంతర్జాతీయ పరిశోధన పత్రాలు సమర్పించాను.

– డాక్టర్ కె.రవీంద్రకుమార్, సీనియర్ శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన స్థానం, కొవ్వూరు

వర్సిటీకి రుణపడి ఉంటా



పిల్లలకు శిక్షణ, రైతులకు సాయం అందించే విషయంలో చేపట్టిన ప్రయోగాలు సత్ఫలితాలు ఇచ్చాయి. 15 ఏళ్లుగా వివిధ రూపాల్లో చేసిన ప్రయోగాలకు ప్రతిరూపం ఈ బంగారు పతకం.. అవార్డు. సంతోషంగా ఉంది. ఉద్యాన వర్సిటీకి రుణపడి ఉంటా.

– డాక్టర్ ఎస్.ఇమ్మానుయేలు, అసోసియేట్ ప్రొఫెసర్, ఉద్యాన కళాశాల, వెంకట్రామన్నగూడెం

న్యూస్‌రీల్

లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సొంగా సందీప్

లింగపాలెం: రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా సొంగా సందీప్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని ధర్మాజీగూడేనికి చెందిన సందీప్‌ను లిడ్ క్యాప్ డైరెక్టర్‌గా నియమిస్తూ నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన ఆయన రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. ధర్మాజీగూడెంలో సందీప్ విలేకరులతో మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన సీఎం జగన్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, సంస్థ ఎండీ తమ్ము డోలాశంఖర్ ఉన్నారు.

13న రీ వెరిఫికేషన్ దరఖాస్తులు స్వీకరిస్తాం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈనెల 13న సెలవు రోజైనా 10వ తరగతి విద్యార్థుల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ దరఖాస్తులను స్వీకరిస్తామని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అదే రోజు సాయంత్రం 5.30 గంటల వరకూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సీఎఫ్‌ఎంఎస్‌లో చెల్లించిన ఫీజు చలానాలతో దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో సమర్పించవచ్చని సూచించారు.

'నవోదయ'లో నూరు శాతం ఉత్తీర్ణత

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2022–23 విద్యాసంవత్సరంలో 10, 12 తరగతుల పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం విద్యార్థులు మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సహాయ, సహకారాలు, నిరంతర పర్యవేక్షణతో ఈ ఘనత సాధించామన్నారు. 12వ తరగతిలో సీహెచ్ లోకేష్ 453, కె.తేజశ్రీ గంగా 453, పి.హరిపూర్ణిమ 447 మార్కులు, 10వ తరగతిలో ఎ.ఉమాశంకర్ 565, ఎన్.మౌళిక 565, వి.హర్షిత్ గంగాధర్ 564 మార్కులు సాధించారన్నారు. ఉపాధ్యాయుల సమష్టి కృషి కూడా విజయానికి దోహదపడిందని ఆయన చెప్పారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

భీమడోలు: భీమడోలు పంచాయతీలో పూర్వపు కార్యదర్శి ఎన్.రమేష్‌గుప్తా పనిచేసిన కాలంలో దుర్వినియోగం కాబడిన రూ.36.04 లక్షల నగదుపై జిల్లా డివిజనల్ అభివృద్ధి అధికారి జి.వెంకటరమణ శుక్రవారం భీమడోలు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. రమేష్‌గుప్తా హయాంలో ఇంటి పన్నులు, కుళాయి కనెక్షన్ల సొమ్ములు ప్రజల నుంచి వసూలు చేసి స్వాహా చేసినట్టు ప్రాథమిక విచారణలో సంబంధిత అధికారులు గుర్తించారు. ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. అయితే స్వాహా చేసిన నగదులో కొంత మొత్తాన్ని కొందరు చలానా రూపంలో అందించినట్టు అధికారులు చెబుతున్నారు. విచారణకు హాజరైన రమేష్ గుప్తా, ఇతర వ్యక్తుల నుంచి వ్యక్తిగత స్టేట్‌మెంట్లు తీసుకున్నట్లు సూపరింటెండెంట్ శేషమూర్తి తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు.

మహాయజ్ఞానికి శ్రీవారి సేవకులు



బస్సులో వెళుతున్న సేవకులు

ద్వారకాతిరుమల: రాష్ట్ర దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైన మహా యజ్ఞానికి ద్వారకాతిరుమల చినవెంకన్న సేవకులు తరలివెళ్లారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం నుంచి గుండుగొలను, జంగారెడ్డిగూడెం, ఏలూరు, భీమడోలు, తాడిచర్ల తదితర ప్రాంతాలకు చెందిన 110 మంది సేవకులు దేవస్థానానికి చెందిన రెండు బస్సుల్లో ఉదయం బయలుదేరారు. యజ్ఞంలో పాల్గొనే వారికి సేవలందించే నిమిత్తం తామంతా అక్కడకు వెళుతున్నట్టు వారు చెప్పారు.

విద్యార్థులు.. ప్రగతి రథ సారథులు

ఏపీ నిట్‌లో ముగిసిన ఇన్నోవేషన్ వర్క్‌షాప్



ఏపీ నిట్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

తాడేపల్లిగూడెం: దేశ ప్రగతి రథ సారథులు విద్యార్థులేనని ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ అనే అంశంపై రెండు రోజులగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు. ప్రగతిశీల వ్యాపార ఆలోచనలకు ఆకృతిని ఇస్తే అంకుర పరిశ్రమలు ఊపిరి పోసుకుంటాయన్నారు. సంకల్పం, పట్టుదల లక్ష్యసిద్ధికి సోపానాలుగా మలచుకుంటూ విజయ శిఖరాలను చేరుకోవాలని ఆయన సూచించారు. ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ డి.డేవిడ్, డాక్టర్ మహ్మద్ గౌస్ మాట్లాడారు. 35 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ సభజిత్ భచర్, స్వరాజ్, పి.శంకర్, జగన్మోహన్‌రావు, కార్తికేయ శర్మ, ఫణీకృష్ణ, సుదర్శన దీప తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో బ్రహ్మోత్సవ శోభ



విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న పారిజాతగిరి ఆలయం



పూజలు చేస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్సేన పూజాదికాలతో అర్చకులు అంకురార్పణ చేశారు. శనివారం ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు, వాహన సేవలు నిర్వహిస్తామని ఈఓ మానికల రాంబాబు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయం, ప్రధాన రాజగోపురాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది సహకారంతో ఏర్పాట్లు చేసినట్లు ఈఓ చెప్పారు. అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు, కంది బాలకృష్ణారెడ్డి, వాసవీ సాయి నగేష్, అర్చకులు నల్లూరి రుషికేశ్ ఆచార్యులు, శ్రీసత్యపవన్‌కుమార్ ఆచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభయాంజనేయునికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

హనుమాన్ జంక్షన్ రూరల్: కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నాల్గో రోజైన శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన జరిగాయి. దేవస్థానాన్ని, అభయాంజనేయ స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం వెంకట శేషారామాచార్యులు అంజనీపుత్రునికి 1008 లిల్లీ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేదికపై సీతారామాంజనేయ భజన సమాజం (రేమల్లె) ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం హనుమంతునికి బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలుజరిగాయి. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, కార్యనిర్వహణాధికారి కూడిపూడి శ్రీనివాస్, అర్చకులు ఆయనకు దేవస్థానం వద్ద సాదర స్వాగతం పలికారు. ఎంపీ శ్రీధర్ అంజనీపుత్రునికి తమలపాకులతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఆయనను స్వామి వారి శేషవస్త్రాలతో ఆలయ చైర్మన్ ఎస్.భూషణం సత్కరించారు.

బడి తెరిచిన రోజే విద్యా కానుక

- స్టాక్ పాయింట్లకు చేరుకుంటున్న విద్యా సామగ్రి
- జిల్లాలో 1.14 లక్షల మందికి అందించేలా ఏర్పాట్లు
- ఇప్పటికే 45 శాతం సామగ్రి చేరిక
- 1 నుంచి పాఠశాలలకు సరఫరా



భీమవరంలో స్టాక్ పాయింట్‌కు చేరిక విద్యా కానుక సామగ్రిని పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

సాక్షి, భీమవరం: పేదల చదువులకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం జగనన్న విద్యా కానుకను పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించేందుకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో 1,359 ప్రభుత్వ పాఠశాలల్లో 1.14 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ తొమ్మిది రకాల విద్యా సామగ్రితో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను అందించనున్నారు. విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే నాడు–నేడు పథకంలో సర్కారీ బడులను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు సమకూరుస్తున్నారు. అలాగే పేద విద్యార్థులను ప్రోత్సహించేలా అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. అలాగే విద్యా కానుకను అందిస్తున్నారు.

9 రకాల విద్యా సామగ్రి

జగనన్న విద్యా కానుక కిట్లలో 9 రకాల విద్యా సామగ్రి, దుస్తులు, బూట్లు, బ్యాగ్, డిక్షనరీ వంటివి పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు పాఠశాలలు ప్రారంభించిన రోజునే (జూన్ 12) అందించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 1,14,024 మందికి కిట్లు అందించాల్సి ఉండగా ఇప్పటికే 45 శాతం సామగ్రి స్టాక్ పాయింట్లకు చేరాయి. ఈనెల 25 నాటికి పూర్తిస్థాయిలో కిట్లు వచ్చే అవకాశం ఉండగా.. వచ్చేనెల 1 నుంచి ఆయా పాఠశాలలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. విద్యా కానుక కిట్లలోని వస్తువుల నాణ్యతను పరిశీలించడానికి ఆయా మండలాలు, పట్టణాల్లో మండల ఇంజనీర్, విద్యాశాఖాధికారి, ఏపీఎంతో ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ టీమ్‌ను ఏర్పాటుచేశారు. యూనిఫామ్, బూట్లు, బ్యాగ్ వంటి వాటిలో నాణ్యత లోపిస్తే వాటిని తిరిగి పంపించి నాణ్యమైన వస్తువులను తిరిగి రప్పించేలా వీరు చర్యలు తీసుకుంటున్నారు. విద్యా కానుక కిట్లను ఆయా పాఠశాలలకు సరఫరా చేసేందుకు ప్రభుత్వ వాహనాలు, సర్వశిక్ష వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

తరగతి	బాలలు	బాలికలు
1వ	3,661	4,019
2వ	3,487	3,828
3వ	3,780	4,256
4వ	4,982	5,407
5వ	5,554	6,014
6వ	6,191	6,444
7వ	6,502	6,936
8వ	6,898	7,196
9వ	7,086	7,279
10వ	7,220	7,283

పకడ్బందీగా పర్యవేక్షణ



వచ్చేనెలలో ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ ఒకేసారి జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీకీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే 45 శాతం వరకు కిట్లకు సంబంధించిన పుస్తకాలు, దుస్తులు, బూట్లు వంటివి స్టాక్ పాయింట్లకు చేరాయి. ఈనెల 25వ తేదీ నాటికి పూర్తిగా అందుతాయి. వచ్చేనెల 1వ తేదీ నుంచి పాఠశాలలకు వాటిని సరఫరా చేస్తాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నాం.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: జిల్లాలోని రెండు ప్రభుత్వ, 16 ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు శుక్రవారం తెలిపారు. వచ్చే నెల 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకుని, ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట ఐటీఐల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని రసీదు పొందాలన్నారు. సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అనర్హులని తెలిపారు. అలాగే మరిన్ని వివరాలకు ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో నేరుగా లేదా ఫోన్ 08816 297093లో సంప్రదించవచ్చని సూచించారు.

ఏలూరు ప్రభుత్వ ఐటీఐలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల సహాయ సంచాలకులు ఉగాది రవి ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసేటప్పుడు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, టీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, 6 నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేయాలని సూచించారు.

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం

స్వీట్లు పంచుకున్న ఉద్యోగులు


భీమవరం కలెక్టరేట్‌లో సీట్లు పంచుకుని ఆనందాన్ని తెలియజేస్తున్న ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రంతో పాటు, జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల పరిధిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఏ(ఇంటి అద్దె అలవెన్స్) 4 శాతం పెంచింది. ఇంతవరకూ హెచ్‌ఆర్‌ఏ 12 శాతం ఉండగా 16 శాతం చేశారు. ఉద్యోగులకు రూ.1500 నుంచి రూ.4 వేల వరకు హెచ్‌ఆర్‌ఏ పెంపుతో లబ్ధి చేకూరుతుంది. హెచ్‌ఆర్‌ఏ పెంచడంపై భీమవరం కలెక్టరేట్‌లోని ఉద్యోగులు స్వీట్స్ పంచుకుని వారి సంతోషాన్ని తెలియజేశారు. హెచ్‌ఆర్‌ఏ పెంచాలని ప్రభుత్వాన్ని కోరిన వెంటనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి పెంచడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఉద్యోగులు సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం తమకు ఉందని వారు పేర్కొంటున్నారు.

సీఎం సార్‌కు కృతజ్ఞతలు



జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఏ 12 నుంచి 16 శాతం చేయడం సంతోషంగా ఉంది. హెచ్‌ఆర్‌ఏ పెంచినందుకు సీఎం సార్‌కు కృతజ్ఞతలు. మా మిగిలిన సమస్యలు కూడా పరిష్కారించాలని కోరుతున్నాను.

– వర్ధినీడి పెద్దిరాజు, రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ

ఉద్యోగులకు ప్రయోజనం



జిల్లా కేంద్రంలో పనిచేసే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 12 నుంచి 16 శాతం చేయడం హర్షణీయం. సీఎం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లా కేంద్రంతో పాటు 8 కిలోమీటర్ల పరిధిలో పనిచేసే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ విషయంలో ప్రయోజనం చేకూరుతుంది. ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించి హెచ్‌ఆర్‌ఏ పెంపు చేసిన సీఎం సార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– వై.దుర్గాకిషోర్, రెవెన్యూ సర్వీసు అసోషియేషన్ చైర్మన్

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీ నోట్ల మీద ముద్రించేలా చూడాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం అందజేశారు.

సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్

ఏలూరు (టూటౌన్): సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్ గోపాల్ కోరారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాసదన్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్జి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఈ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 13న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని కోర్టులున్న అన్ని ప్రదేశాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో ఇప్పటి వరకూ 6,514 పెండింగ్ కేసులు, 2097 ప్రీ లిటిగేషన్ కేసులు గుర్తించినట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి పోలీసు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ అధికారులు, ప్రజలతో ప్రత్యక్షంగా పరోక్షంగా 50 సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు. లోక్ అదాలత్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 31 బెంచ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్, వాహన ప్రమాద, బీమా, చెక్ బౌన్స్, కుటుంబ వివాదాలు, మున్సిపల్ ట్యాక్స్, చిట్ ఫండ్ కేసులతో పాటు కోర్టు ముందుకు రాని బ్యాంకు లావాదేవీల కేసులు, విద్యుత్ బకాయిలు, టెలిఫోన్ బకాయిలు మొదలైన ప్రీలిటిగేషన్ కేసులు రాజీ చేస్తామన్నారు. పట్టుదలకు పోకుండా కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్రంలో 4 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని దీనికి ప్రత్యేకంగా అనేక కార్యక్రమాల ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించడానికి అవకాశాలు న్యాయ శాఖ ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి, పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి, డీఎస్పీ జీవీ పైడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం గవరపేటకు చెందిన మహిళ కనిపించడం లేదని ఆమె తల్లి శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యమైన మహిళ ఉల్లంపర్రులోని ఒక ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో చదువుతోందని.. ఈ నెల 5న కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిందని, ఆ రోజు నుంచి తిరిగి రాలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మహిళ భర్త ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చేపల చెరువు వద్ద పనిచేసే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దొంగపిండి గ్రామానికి చెందిన బొడ్డు ఏడుకొండలు (47) అదే గ్రామంలో మంతెన శ్రీనివాసరాజుకు చెందిన చేపల చెరువు వద్ద నెలవారీ జీతానికి పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే గురువారం సాయంత్రం చేపల చెరువు వద్ద పని చేశాక రాత్రి ఇంటికి రాకపోకపోవడంతో కుమారుడు బొడ్డు ఈశ్వర్, అతని బంధువు బ్రహ్మంనాయుడుతో కలిసి వెళ్లి చూడగా ఏడుకొండలు మడత మంచంపై నగ్నంగా పడియున్నాడు. ఏడుకొండలు నోటి వెంట నురుగ రావడం, చెవులు, కళ్లలోంచి రక్తం వచ్చినట్లు మరకలు ఉండటంతో కుమారుడు బొడ్డు ఈశ్వర్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

టీడీపీ నేత అత్యుత్సాహం


పూళ్లలో గోదావరి కాల్వపై రోడ్డుకు అడ్డంగా నరికిన చెట్లు

భీమడోలు: ఓ టీడీపీ నాయకుడి అత్యుత్సాహం వల్ల విద్యుత్ శాఖకు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. పూళ్లలో గోదావరి కాల్వ గట్టుపై టీడీపీ నేత గురివెల్లి శంకర్ ఆక్రమణలకు పాల్పడ్డాడు. అక్కడ ఉన్న భారీ వృక్షాలను సంబంధిత అధికారుల అనుమతి లేకుండా శుక్రవారం నరికివేయగా.. ఆ చెట్ల కొమ్మలు విరిగి ఎదురుగా ఉన్న విద్యుత్ తీగలపై పడి రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, ఏడు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. గురువారం పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లో గాలి వాన బీభత్సానికి తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ఆ గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పర్యటించారు. గురివెల్లి శంకర్ వల్ల తీవ్ర ఇబ్బంది పడ్డామని పూళ్ల సంతమార్కెట్ ప్రజలు ఎమ్మెల్యే వాసుబాబుకు ఫిర్యాదు చేసారు. అసలే గ్రామంలో విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడుతుంటే పనిలో పనిగా ఆ నాయకుడు కాల్వపై ఉన్న చెట్లను నరికి అంధకారంలోకి నెట్టాడని ఆవేదన వ్యక్తం చేసారు. దీనితో తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులకు సూచించారు.

కారులో ఒక్కసారిగా మంటలు


నూజివీడు మండలం సీతారామపురం వద్ద కారులో చెలరేగిన మంటలు

నూజివీడు: ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు. ఏలూరుకు చెందిన తాణంకి గంగాధరరావు తన భార్య, ఇద్దరు కుమార్తెలు, తల్లితో కలిసి నూజివీడు మండలం గొల్లపల్లిలో ఉన్న బంధువుల ఇంట్లో వివాహానికి శుక్రవారం వెళ్లారు. అనంతరం తిరిగి ఏలూరు వెళ్తుండగా సాయంత్రం 4.15గంటల సమయంలో మండలంలోని సీతారామపురం వద్దకు వచ్చేసరికి కారు ఇంజిన్ భాగంలో పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి. వెంటనే కారును రోడ్డు పక్కన నిలిపివేసి అందరూ కారులో నుంచి కిందకు దిగారు. సమీపంలోనే ఉన్న రోడ్డు సేఫ్టీ మొబైల్(ఆర్ఎస్) సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, ఏఆర్ పీసీ శివరామకృష్ణలు హుటాహుటిన కారువద్దకు వచ్చి స్థానికుల సాయంతో నీళ్లు కొట్టి మంటలను ఆర్పివేశారు. కొద్దిసేపటికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను పూర్తిగా ఆర్పేసింది.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

పోలవరం రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సొమ్ములు తీసుకుని మోసం చేశారని బంగారంపేటకు చెందిన పప్పుల శ్రీను పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. బంగారంపేటలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో 3 నెలల క్రితం కె.అనిల్ సతీష్ అనే వ్యక్తి రిసార్ట్ సందర్శనకు వచ్చాడని, ఆ సమయంలో రిసార్ట్ అభివృద్ధి చేయిస్తాను, ఉద్యోగాలిప్పిస్తానంటూ మాయ మాటలు చెప్పాడని, తన నుంచి రూ.7 లక్షలు తీసుకున్నట్లు శ్రీను ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

కాళ్ల: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఆకివీడు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఆకివీడు గ్రామం ముస్లిం వీధికి చెందిన వ్యక్తి కుమార్తె పదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. మే 10వ తేదీ రాత్రి నుంచి ఆ బాలిక కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆకివీడు ఏఎస్ఐ డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల పరిశీలన



మంచిలిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యనారాయణ

అత్తిలి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులు నిర్దిష్ట కొలతల ప్రకారం, నాణ్యతతో ఉండాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ కోరారు. అత్తిలి మండలం మంచిలి గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఉపాధి పథకం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పిండంతో పాటు, గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీవీవీఎస్ రామారావు, వైస్ ఎంపీపీ దారం శిరీషా, సర్పంచ్ చింతారామయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించడం పవన్ కల్యాణ్‌కు తగదు

తణుకు టౌన్: వైఎస్సార్‌సీపీని విమర్శించే స్థాయి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు లేదని తణుకు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కె.జస్పాల్ అన్నారు. పవన్ కల్యాణ్ రాబోయే ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తామనే విశ్వాసం లేదనే విషయం ఆయన స్పష్టం చేశారని తెలిపారు. తన పార్టీ గెలుపుపై, కార్యకర్తలపై స్పష్టత, నమ్మకం లేని నాయకుడు వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత లేదని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిందని, టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో 10 పథకాలైన చెప్పాలని డిమాండ్ చేశారు. కాపులు వైఎస్సార్‌సీపీని విడాలని కోరుతున్న పవన్ కల్యాణ్ ముద్రగడ పద్మనాభం విషయంలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా వేసవి శిక్షణ



ప్రథమశ్రేణి గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం విద్యార్థులు లెక్కలు, ఇంగ్లీషు స్టోరీలు, తెలుగు, హిందీ, దేశభక్తి గీతాలు నేర్పించామని గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మహాశివభట్టు లక్ష్మణరాజు, ఎ.జనార్ధనరావు, ప్రత్తి వీరాస్వామి, ఎస్.సాల్మన్‌రాజులు విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన కల్పించారని చెప్పారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

భీమవరం(ప్రకాశం చౌక్): క్రీడలు యువతకు శారీరిక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వైఎస్సార్ సీపీ నాయకుడు గ్రంధి రవితేజ అన్నారు. డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల వారి ఆట స్థలంలో ఏర్పాటు చేసిన ధనాల లక్ష్మి నరసింహ మెమోరియల్ రాష్ట్రస్థాయి రెల్లి కమ్యూనిటీ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లి కమ్యూనిటీ తరపున ఇలాంటి టోర్నమెంట్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొచ్చ ధర్మ, సంఘం నాయకులు ధనాల సాయి, నీలాపు వెంకట్ ధనాల పవన్ కుమార్, డి.పరమేష్, ధనాల రాము, డి.బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆదిత్య స్కూలులో పదో తరగతి ఫలితాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించిన ట్యూస్కూల్ డైరెక్టరు లయన్, డాక్టర్ ఆదిత్య కృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జీఎస్ డీఎస్ మేఘన, బీహెచ్ఎస్ చైతన్య వర్మ, ఎస్.నవ్య, సీహెచ్ నీలా సంజీవని, జె.మృదుహాసిని, కె.పాల్ సుధాకర్ తదితరులను అభినందించారు. పలు బహుమతులతో విద్యార్థులను సత్కరించారు. ప్రిన్సిపల్ కెవి సత్యనారయణ, బి.యుగసుధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై అవగాహన

నరసాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. శుక్రవారం తరగతులకు పెద్దసంఖ్యలో పిల్లలు హాజరయ్యారు. శుక్రవారం ముందుగా పిల్లలకు మహాభారతం, రామాయణం, భాగవతం కావ్యాల్లోని కథలు చెప్పించారు. అనంతరం యోగాపై శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. వచ్చే నెల 11 వరకూ జరిగే ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణా తరగతులకు తమ పిల్లలను పంపించడానికి తల్లితండ్రులు శ్రద్ధ చూపించాలని లైబ్రేరియన్ కేజేఎల్ఎల్ కుమారి చెప్పారు.

చూసిన కనులదే భాగ్యం



కల్యాణం వీక్షిస్తున్న భక్తజనం



కల్యాణ వేదికపై స్వామి, అమ్మవారు



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

- కనుల పండువగా వెంకన్న కల్యాణం
- పులకించిన భక్తజనం

తాడేపల్లిగూడెం అర్బన్: శ్రీదేవి భూదేవి సమేతుడైన వెంకన్న పెళ్లికొడుకు మోముతో చిరుసిగ్గులొలుకుతూ తాడేపల్లిగూడెం పట్టణ వీధుల్లో ఊరేగారు. భక్తులు వడ్డికాసుల వాడా.. వెంకటరమణ గోవిందా.. గోవిందా అంటూ పారవశ్యం చెందారు. స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కోనేటిరాయుడు కొలువుదీరిన ఏడుకొండల స్వర్గం సెట్టింగ్ సాక్షాత్కరించారు. ధగ ధగ కాంతులతో మెరిసే కల్యాణ వేదికపై తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన రుత్వికుల బ్రహ్మత్వంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వెంకన్న పెళ్లి కనులపండువుగా సాగింది. కలియుగ దేవుడు, భక్తుల కొంగుబంగారం, కోరిన కోర్కెలు తీర్చే శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం ప్రధానవు గడియ నుంచి ఆద్యంతం సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది. సంప్రదాయ మేళతాళాలు, సంస్కృతికి దర్పణంగా అలంకరణలతో వేషాలు, కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. విజయవాడ కనకదుర్గ దేవస్థానం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నేత మారం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ కల్యాణ కదురమణీయంగా నిర్వహించారు. భక్తులు తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. ప్రసాద వితరణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, ఆర్యవైశ్య సంఘ నాయకులు కోనా శ్రీనివాసు, ఒబిలిశెట్టి నటరాజు, పాలూరి వెంకటేశ్వరరావు, మాకా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

చదువుకు సార్ధకత లభించింది

బంగారు పతకాలు అందుకున్న ఉద్యాన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: 'చదువుకొన్న చదువుకు సార్ధకత లభించింది. ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఉన్నత వ్యక్తుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నాం. క్షేత్రస్థాయిలో విద్య ద్వారా వచ్చిన గుర్తింపుతో సేవలను అందిస్తాం' అని ఉద్యాన వర్సిటీ ఐదో స్నాతకోత్సవం సందర్భంగా శుక్రవారం బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులు చెప్పారు. ఉన్నత విద్యకు వెళతామని కొందరు.. ఉద్యోగాలతో రైతులకు మేలు చేసే పనులు చేస్తామని మరికొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

నానో టెక్నాలజీ చేరువ చేస్తా



నాన్న వ్యవసాయం చేస్తారు. ఆయన ప్రభావం నాపై పడింది. మొక్కల పెంపకాన్ని ఇష్టపడే నేను శాస్త్రవేత్త కావాలని ఉద్యాన విద్యను అభ్యసించా. బంగారు పతకం అందుకోవడం ఆనందంగా ఉంది. రైతులకు నానో టెక్నాలజీ చేరువ చేయడం నా లక్ష్యం.

– డి.విజయారెడ్డి, దేవరకొండ పుల్లయ్యశాస్త్రి బంగారు పతక గ్రహీత

కలనెరవేరింది



ఉద్యాన విద్యలో గుర్తింపు తెచ్చుకోవాలనుకున్నాను. అది నెరవేరింది. రైతులకు ఉపయుక్తంగా ఉండే పద్ధతులను వారికి అందించడానికి కృషి చేస్తాను.

– ఎస్.రాజశేఖరరెడ్డి, దేవరకొండ పుల్లయ్యశాస్త్రి బంగారు పతక విజేత

ఉద్యాన రైతులపై సినిమా తీస్తా



ఉద్యాన విద్య అంటే ఇష్టం. అది పూర్తి చేశా. నాకు సినిమాలపై ఆసక్తి. ఉద్యాన ఇతివృత్తంతో సినిమా తీయాలని ఉంది. బహుముఖ ప్రతిభకు బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉంది.

– ఆర్.తౌర్యా నాయక్, లెఫ్టినెంట్ అమిత్ షా బంగారు పతక విజేత

శాస్త్రవేత్తగా గుర్తింపు పొందుతా



ఉద్యాన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందాలి. అదే నా లక్ష్యంతో ఉన్నా. 9.16 ఓజీపీఏతో బంగారు పతకం సాధించడం లక్‌గా భావిస్తా.

– ఏడీపీ రవితేజ, టీటీ దాశరధి బంగారు పతక విజేత

కొత్త వంగడాలకు ఊపిరి పోస్తా



రైతు రాజు కావాలంటే చేసే వ్యవసాయం కలిసి రావాలి. మంచి విత్తనాలు, మంచి నారు వంటివి అందుబాటులో ఉండాలి. అధిక దిగుబడులు సాధించాలి. లాభాలు ఆర్జించాలి. అలా రైతు బాగు కోసం కూరగాయల శాస్త్రవేత్తగా కొత్త వంగడాలకు ఊపిరి పోస్తా.

– దేవిరెడ్డి మేఘన, అన్నే శిఖామణి బంగారు పతక విజేత

పరిశ్రమ స్థాపిస్తా



వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చా. వ్యవసాయంపై ఆసక్తితో చదివా. ఉద్యాన విద్యలో పీపీ చేశా. ఉద్యోగం చేస్తున్నాను. ప్రోసెసింగ్ పరిశ్రమ స్థాపించాలన్నది నా కోరిక.

– ఎస్.పావని, డాక్టర్ టీటీ దాశరధి బంగారు పతక గ్రహీత

తక్కువ వ్యయం.. అధిక దిగుబడే ఆశయం

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు రైతులు సాధించే విధంగా కృషి చేస్తా. పీహెచ్‌డీ పూర్తి చేసి గరికపాడు కేవీకేలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాను. 9.41 ఓజీపీఏ సాధించి గోల్డ్ మెడల్ కొట్టడం అమితానందంగా ఉంది.

– కె.లక్ష్మీకళ, అడ్డా వెంకాయమ్మ బంగారు పతక విజేత

రైతులకు సేవ చేస్తా



నాన్న రక్షణ రంగంలో పని చేస్తారు. నేను రైతు సేవలో పునీతం కావాలనుకున్నా. ఉద్యాన విద్య వైపు వచ్చా. మేలైన ఉద్యాన వంగడాలు అభివృద్ధి చేసి రైతులకు చేరువ చేస్తా.

– జి.పరంజ్యోతి, అన్నే శిఖామణి గోల్డ్ మెడల్ గ్రహీత

మానవ జీవితానికి నడక సంజీవని వంటిది



సమావేశంలో మాట్లాడుతున్న ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ కృష్ణారావు, చిత్రంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవీంద్రబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవ జీవితానికి నడక సంజీవని వంటిదని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సుంకర రవీంద్రబాబు అన్నారు. స్థానిక పదం కుమార్ గుప్తా వాకర్స్ భవనంలో శుక్రవారం వాకర్స్ అధ్యక్షుడు కురుమాళ్ల వెంకటాచలం అధ్యక్షతన నిర్వహించిన ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో రవీంద్రబాబు మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో పాశ్చాత్య పోకడలకు వెళ్లడం, యాంత్రీకరణలో భాగంగా మనిషికి బీపీ, షుగర్, ఆస్తమా, గ్యాస్ ట్రబుల్, వంటి రుగ్మతులు సర్వసాధారణంగా వస్తున్నాయని చెప్పారు. నియమిత ఆహారం, నిత్యం వాకింగ్, శరీరానికి అవసరమైన వ్యాయామం అవసరమన్నారు. వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిపూడి వెంకట కృష్ణరావు మాట్లాడుతూ వాకర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవలు, వైద్య శిబిరాలు, రక్తదానం, మొక్కలు పెంపకం, పంపిణీ, స్వచ్ఛభారత్ తదితర విషయాలను వివరించారు. మహిళా సభ్యుల సేవలను కొనియాడారు. కార్యక్రమాన్ని కోశాధికారి, కార్యదర్శిలు పప్పొప్పుల కుమారస్వామి, పీవీ పరమాత్మలు పర్యవేక్షించారు. తొలుత రవీంద్రబాబు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఇంటర్నేషనల్ గవర్నర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు, వాకర్స్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన ధాన్యం సేకరణ

మొగల్తూరు: ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రామన్నపాలెం 2 సచివాలయాన్ని సందర్శించి ధాన్యం రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ అనిల్ కుమారి మాట్లాడుతూ రామన్నపాలెం 1, 2 సచివాలయ పరిధిలో సుమారు 200 ఎకరాలు కోతలకు రావాల్సి ఉందని, 1121 రకం విత్తనాలు వినియోగించడం వల్ల ధాన్యం దిగుబడి ఆలస్యమైందని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ఈ నెలాఖరుకు పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ పూర్తి చేయాలని, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం డబ్బులు కూడా ఎప్పటికప్పుడు రైతుల ఖాతాలో జమ అయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.అనిత కుమారి, వీహెచ్ఏ రాజగోపాల్ తదితరులున్నారు.

సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు



విలేకరులతో మాట్లాడుతున్న పాతపాటి శ్రీనివాస్‌రాజు

కాళ్ల: 'తమ కుటుంబంపై ఆధార అభిమానాలు చూపిస్తు మా వెన్నంటే ఉంటు దివంగత నేత పాతపాటి సర్రాజు చేపట్టిన క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆయన కుమారుడుడైన నాకు క్షత్రియ కార్పొరేషన్ పదవి ఇచ్చి సీఎం జగన్‌మోహన్ రెడ్డి మా కుటుంబానికి గుర్తింపుని ఇచ్చారు' అని పాతపాటి శ్రీనివాసరాజు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన గృహం వద్ద శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి తన తండ్రి పాతపాటి సర్రాజు కుటుంబంపై ఆధారాభిమానులు చూపించే వారిని గుర్తు చేసుకున్నారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం కూడా ఆయన తనయులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబం వెన్నంటే ఉన్నారని స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరం తన తండ్రి సర్రాజు ను గుర్తించి రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ గా పదవిని అప్పగించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్షత్రియులందరికీ సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని తెలిపారు. అయితే ఆయన మరణానంతరం ఆ పదవిని ఆ కుటుంబానికే ఇవ్వాలనే ఆలోచనతో ఆయన కుమారుడైన నాకు మళ్లీ క్షత్రియులందరికీ సేవ చేసే అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 14న విజయవాడలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో వెంకటేశ్వరరావు రెసిడెన్సీ ,ఆర్టీసీ కాలనీ , సాయిబాబా టెంపుల్ రోడ్డులో బెంజ్ సర్కిల్ వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. అంతేకాకుండా అదే రోజు క్షత్రియ కార్పొరేషన్ భవనం కూడా ప్రారంభించనట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాళ్ల ఆకివీడు మండలాల పార్టీ కన్వీనర్లు గణేశ్న రాంబాబు, గుండుగొల్లు ధనరాజు, ఆకివీడు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, పార్టీ నాయకులు వేగేశ్న సూర్యనారాయణ రాజు, మంతెన చిన నరసింహారాజు, కడితల సాల్మన్ రాజు,బొల్లా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

హైవే అథారిటీ అధికారులకు వినతి

నరసాపురం రూరల్: సీతారామపురం వద్ద నిర్మించిన టోల్ గేట్ పేరుమార్పు, స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు, పైపులైన్ల పునరుద్ధరణ, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని సొసైటీ అధ్యక్షుడు పులపర్తి ప్రతాప్, పలువురు గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మచిలీపట్నంలోని హైవే అథారిటీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో సుమారు కిలోమీటరు మేర పాడైన గ్రామానికి తాగునీటిని అందించే పైపులైన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, అలాగే స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయడం, జాతీయ రహదారిని ఆనుకుని మూడు చోట్ల అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

స్త్రీ నిధి.. మహిళలకు పెన్నిధి



సమావేశమైన మహిళా సంఘ సభ్యులు (ఫైల్)

పెంటపాడు: అభివృద్ధే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల ద్వారా వైఎస్సార్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. తద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోంది. గతంలో మహిళలు చిరువ్యాపారం నిర్వహించుకోవాలంటే ప్రేవేటు బ్యాంకులను ఆశ్రయించేవారు. వీరు సూక్ష్మ రుణాల పేరిట అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను అడ్డంగా దోచుకొనేవారు. కుటుంబాలకు ఆర్థికంగా నష్టం వాటిల్లేది. ఈ నేపథ్యంలో మహిళల కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్త్రీ నిధి బ్యాంకులను ఏర్పాటు చేసింది. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు పొదుపు చేస్తూనే మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం కల్పించిన స్త్రీ నిధి ద్వారా రుణం పొంది కిరాణా, ఫ్యాన్సీ, టైలరింగ్, గొర్రెల పెంపకం, పాడిగేదెల పెంపకం, తినుబండారాల దుకాణం, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. వీరు వ్యాపారానికి స్త్రీ నిధి ద్వారా ఒక్కో పొదుపు సంఘంలోని సభ్యులకు రూ.50 వేలు నుంచి రూ.1 లక్ష వరకు పొందవచ్చు. పెంటపాడు మండలంలో 1,541 స్వయం సహాయక గ్రూపులు ఉండగా ఒక్కో సంఘానికి రూ.4 లక్షల చొప్పున స్త్రీ నిధి ద్వారా 782 సంఘాలకు రుణం మంజూరు చేశారు. తద్వారా 3,955 మందికి రూ.17.89 కోట్ల రుణం అందింది. రికవరీ శాతం కూడా నూరు శాతం జమ అవుతోంది. పెంటపాడు మండలంలో వైఎస్సార్ ఆసరా ద్వారా 1,345 సంఘాలు అర్హత సాధించాయి. కాగా ఇప్పటివరకు ఆసరా రుణం కింద రెండు విడతలుగా రూ.25.80 కోట్లు పొదుపుసంఘాల ఖాతాలలో జమైంది.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



స్వయం సహాయ సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. ఈ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. క్రమం తప్పకుండా పొదుపు పాటించి పొందిన రుణాలను సకాలంలో చెల్లించే విధంగా కృషిచేయాలి.

– కె.లక్ష్మి, ఏపీఎం ఇన్‌చార్జి, పెంటపాడు

అభివృద్ధికి తోడ్పడింది



ఈ స్త్రీ నిధి పథకం మా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పడింది. ఈ పథకం ద్వారా రూ.50 వేలతో గాజులు, ఫ్యాన్సీ దుకాణం నిర్వహించుకొంటున్నాను. తద్వారా ప్రభుత్వ సాయంతో స్వయం ఉపాధి పొందుతూ నా కుటుంబానికి అండగా నిలుస్తున్నాను.

– కేదారి పావని, రాజరాజేశ్వరి గ్రూపు, పెంటపాడు